
# సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం । 21 । ఏప్రిల్ । 2025




**ఇరుగులమ్మా.. దీవించవమ్మా..**

ఇరుగులమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి ఆకాంక్షించారు. -8లో



**ఔషధ గుణం.. ఆరోగ్య ప్రదం**

వేసవిలో తాటిముంజలకు ప్రత్యేక స్థానం ఉంది. వేసవిలో శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారించి ఆరోగ్య ప్రయోజనాలను చేకూర్చడంలో ప్రాచుర్యం పొందాయి. -8లో

**మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)**

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.100 | రూ.120 |
| రెండోరకం | రూ.60 | రూ.90 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 219 మెట్రిక్ టన్నులు



## న్యూస్‌రీల్

### నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈ నెల 21వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### గంగమ్మా..కాపాడమ్మా



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

లక్కిరెడ్డిపల్లి: గంగమ్మా.. వర్షాలు కురిపించి.. కరుణించి కాపాడు తల్లీ అంటూ భక్తులు వేడుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న అనంతపురం గంగమ్మకు ఆదివారం భక్తులు బోనాలు సమర్పించారు.తలనీలాలు అర్పించారు. చుట్టు పక్కల వారే కాకుండా ఇతర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చిఅమ్మవారిని దర్శించుకున్నారు. పూజారులు చెల్లు వంశీయులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### అనారోగ్య బదిలీకి తాజా సర్టిఫికెట్లు పొందాలి

రాయచోటి అర్బన్: అనారోగ్య కారణాలపై బదిలీని కోరుకునే ఉపాధ్యాయులు తాజా సర్టిఫికెట్లను పొందాలని డీఈఓ కె.సుబ్రమణ్యం తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామ రాజు ఉత్తర్వుల మేరకు ఉపాధ్యాయులు తాజా సర్టిఫికెట్లు పొంది సమర్పించాల్సి ఉంటుందన్నారు. 2025 సంవత్సరానికి సంబంధించి ఉపాధ్యా యుల బదిలీలు జరుగుతున్న దృష్ట్యా ప్రతిపాదిత మార్గదర్శకాల ప్రకారం సర్టిఫికెట్లు పొందిన వారు ప్రాధాన్యత కలిగిన వారిగా పరిగణింపబడతారన్నారు. అనారోగ్య కారణాలు చూపుతూ బదిలీకోరే ఉపాధ్యాయులకు ఈనెల 24 నుంచి 26వరకు కడప రిమ్స్‌లో ఏర్పాటు చేసిన అదనపు డైరెక్టర్లు, వైద్యవిద్య సూపరింటెండెంట్‌లు ధృవపత్రాలు జారీ చేస్తారన్నారు. శారీరక వైకల్యం, 80 శాతం కంటే ఎక్కువ దృష్టిలోపం కలిగి ఉన్న, వినికిడి లోపం ఉద్యోగులు తాజా పత్రాలను పొందాల్సి ఉంటుందన్నారు. గుండె సంబంధిత వ్యాధులు, అవయవ మార్పిడి, క్షయ,టీబీ, కిడ్నీమార్పిడి, డయాలసిస్ చికిత్స పొందుతున్నవారు సర్టిఫికెట్లను పొందాల్సి ఉంటుందన్నారు. ఉమ్మడి చిత్తూరుజిల్లా ఉపాధ్యాయులు తిరుపతి ఎస్వీఆర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఉమ్మడి కడప జిల్లా ఉపాధ్యాయులు కడప ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి వైద్య ధృవపత్రాలను పొందాలని ఆయన తెలిపారు.

# నిర్లక్ష్యపు నీడలు!

- టీటీడీలోకి విలీనమైనా మారని సౌమ్యనాథాలయం పరిస్థితి
- కన్నెత్తిచూడని టీటీడీ చైర్మన్, ఈఓలు
- ఆలయ ప్రాంగణంలో పడకేసిన గార్డెనింగ్
- శనివారం భక్తుల ఆకలి తీర్చని టీటీడీ



నందలూరులోని సౌమ్యనాథాలయం (ఇన్‌సెట్ ) స్వామివారి మూలవిరాట్టు

రాజంపేట: దక్షిణాది రాష్ట్రాల్లోని వైష్ణవ ఆలయాల్లో అతిపెద్దది చోళుల కాలంనాటి సౌమ్యనాథాలయం . ఈ ఆలయంపై టీటీడీ నిర్లక్ష్యపు నీడలు వెంటాడుతున్నాయి. టీటీడీ దీనిని పేరుకే విలీనం చేసుకున్నట్లు కనిపిస్తోందని భక్తులు పెదవి విరిస్తున్నారు. సెంట్రల్ ఆర్కియాలజీ, టీటీడీ మధ్య సమన్వయం కొరవడటంతో ఆలయ అభివృద్ధి అటకెక్కిందనే విమర్శలు ఉన్నాయి. టీటీడీ, కేంద్రపురావస్తుశాఖ మధ్య సమన్వయం లేకపోవడమే దీనికి కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆలయంలో కల్యాణవేదిక, పరిపాలనగదులు, పోటు, సిబ్బంది గదులు నిర్మించడానికి కూడా అభ్యంతరాలు పుట్టుకొచ్చాయి. దీంతో రేకులషెడ్ నిర్మితం చేసుకున్నారు. ఆలయంలో భక్తుల సౌకర్యాల విషయంలో కూడా నిర్లక్ష్యధోరణే కనిపిస్తోంది.. ఇప్పటికే ఆలయంలో సెంట్రల్ ఏసీతోపాటు అంతరాలయంలో ఏసీ తదితర సౌకర్యాల కల్పన దిశగా వచ్చిన పరికరాలు మూలనపడేశారు.

**పేరుకే విలీనం:** 2022లో తిరుమల తిరుపతి దేవస్థానంలోకి సౌమ్యనాథాలయం విలీనమైంది. ఒంటిమిట్ట రామాలయం తర్వాత దీనిని విలీనం చేసుకున్నారు. ఇక ఆలయం అభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్న భక్తుల ఆశలు అడియాసలయ్యాయి. ఈ ఆలయం వైపు టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు, ఈవో, జేఈవోలు కనీసం కన్నెత్తిచూడటంలేదన్న విమర్శలున్నాయి. కొన్ని నెలలుగా ఒంటిమిట్టకు వెళుతున్నా.. సౌమ్యనాథాలయం టీటీడీలో ఉందనే భావనలో వారు లేనట్లు కనిపిస్తోందని భక్తులు పెదవివిరిస్తున్నారు.

**శిథిలావస్థలో ప్రాచీన ప్రహరీ**

11 వశతాబ్దంలో చోళవంశరాజు కుళోత్తుంగచోళుడు శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. చుట్టూ వున్న ప్రహరీగోడ శిథిలావస్థకు చేరుకుంది. దక్షిణ, ఉత్తర, తూర్పు గాలిగోపురాలతో మిళితమైన ప్రహరీగోడ పై భాగం కూలిపోయినా ఇంతవరకు పునర్నిర్మించలేదు. కేంద్రపురావస్తుశాఖ నిర్లక్ష్యం ఇందులో స్పష్టంగా కనిపిస్తోంది.

**ఆలయ నిర్వహణలో నిర్లక్ష్యం**

కేంద్రపురావస్తుశాఖ నిర్లక్ష్యం ఆలయ నిర్వహణలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఆలయ ప్రాంగణంలో చెత్తచెదారాలు పేరుకుపోయాయి. పాములు సంచరిస్తున్నాయి. మరుగుదొడ్ల నిర్వహణ గాలికొదిలేశారు. ఆలయ ప్రహరీ పూర్తిస్థాయిలో బాగుచేయలేదు. ఒక రకంగా ఆలయ అభివృద్ధికి ఆర్కియాలజీ ఆంక్షలు అడ్డుగోడగా ఉన్నాయి.

### సౌమ్యనాథా..ఏదీ అన్నప్రసాదం

ఆలయంలో 108 ప్రదక్షణలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం.దీంతో శనివారం అధికసంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లానుంచే కాకుండా ఇతర జిల్లాలనుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. దేవదాయశాఖ పరిధిలో ఆలయం ఉన్నప్పుడు దాతల సహకారంతో అప్పట్లో చైర్మన్ అరిగెల సౌమిత్రి, పాలకమండలి ఆధ్వర్యంలో ప్రతి శనివారం భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేసేవారు. భక్తులు ఇక్కడే భోజనం చేసుకుని వెళ్లేవారు. ప్రస్తుతం టీటీడీలో విలీనమైనా అన్నప్రసాదాలను అందచేసేందుకు టీటీడీ ముందుకురాలేదు. నందలూరు బస్టాండులో నాన్‌వెజ్ హోటల్స్ ఉండటంతో భోజనం తినడానికి భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.ఇప్పటికైనా టీటీడీ అధికారులు స్పందించి అన్నప్రసాదం పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### భక్తుల దాహార్తి తీర్చని జలప్రసాదం ప్లాంట్

సౌమ్యనాథాలయంలో నిర్మితమైన జలప్రసాదం ప్లాంట్‌ను మూలనపడేశారు. భక్తుల దాహార్తి తీర్చేందుకు సౌకర్యాల కల్పనపై టీటీడీ దృష్టి సారించలేదు. టీటీడీ ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోలేదు. డిప్యూటీ ఈవో, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో భక్తుల సౌకర్యాల కల్పన దిశగా ఎప్పటికప్పుడు నివేదికలు టీటీడీకి వెళుతుండాలి. మరీ అలా జరుగుతుందో లేదో టీటీడీ పాలకమండలికే తెలియాలి.



జలప్రసాదం ప్లాంట్‌ను మూలనపడేసిన టీటీడీ

### టీటీడీ బోర్డు దృష్టిసారించాలి



టీటీడీలోకి సౌమ్యనాథాలయం విలీనమయ్యాక ఒంటిమిట్ట రామాలయం తరహాలో అభివృద్ధి చెందుతుందని ఆశించాం. టీటీడీ పాలకమండలి ఆలయ అభివృద్ధిపై దృష్టి సారించాలి. శనివారం రోజున టీటీడీ భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలి.

–మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ, నందలూరు

### భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



గతంలో భక్తులు సహకారంతో ప్రతి శనివారం వివిధ జిల్లాల నుంచి భక్తుల ఆకలి తీర్చేవిధంగా అన్నప్రసాదాలను పంపిణీ చేసేవారము. టీటీడీలోకి విలీనమైన తర్వాత అన్నప్రసాదాలను పంపిణీ చేయడం లేదు. ఈ విషయంపై టీటీడీ తక్షణమే స్పందించాలి. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి.

–అరిగెల సౌమిత్రి, ఆలయ మాజీ చైర్మన్, నందలూరు

### సీఎం జన్మదినానికి సుగవాసి బ్రదర్స్ దూరం


రాయచోటి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు కుమారులు దూరమయ్యారు. ఆదివారం చంద్రబాబు 75వ జన్మదిన వేడుకలను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అనుచరులు జరుపుకున్నారు. నాలుగు పర్యాయాలు టీడీపీలో ఎమ్మెల్యేగా, ఒక పర్యాయం ఎంపీగా గెలుపొందిన సుగవాసి పాలకొండ్రాయుడు రాయలసీమలోనే కాపు సామాజిక వర్గంలో సీనియర్, బలమైన రాజకీయ నేతగా పనిచేశారు. ఆయన ఆరోగ్య సమస్యల కారణంగా ఆయన కుమారులు బాలసుబ్రమణ్యం, ప్రసాద్‌బాబులు రాజకీయ వారసత్వంగా కొనసాగుతున్నారు. పార్టీ కష్టకాలంలో సైతం నియోజకవర్గంలో ఉంటూ కార్యకర్తలకు, నాయకులకు తోడుగా నిలిచారు. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్, పార్టీ నుంచి వారికి సరైన మద్దతు లభించకపోవడంతో అవమానానికి గురైన ఆ పార్టీ కేడర్ కూడా ఈ వేడుకలకు దూరమైంది. రాయచోటిలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు, ఆయన అనుయాయులు మాత్రం కేక్ కట్ చేసి రోగులకు పండ్ల పంపిణీతో సరిపుచ్చుకున్నారు. ఈ నెలలో జరిగిన ఒంటిమిట్ట కోదండరామస్వామి కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతున్నా నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న బాలసుబ్రమణ్యంకు కనీస సమాచారం లేకపోవడం సుగవాసి అభిమానుల్లో నిరాశ, నిస్పృహలు నెలకొన్నాయి. అనంతరం సుగవాసి ప్రసాద్‌బాబు చంద్రబాబు, లోకేష్‌లను నేరుగా కలిసినప్పటికీ సరైన హామీ లభించకపోవడంతో కినుక వహించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆదివారం జరిగిన చంద్రబాబు జన్మదిన వేడుకల్లో సుగవాసి బ్రదర్స్ బాలసుబ్రమణ్యం, ప్రసాద్ బాబు, వారి అనుయాయులు నియోజకవర్గంలో ఎక్కడా పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది.

- సంబేపల్లె టీడీపీలో వర్గ పోరు బట్టబయలైంది. ఆదివారం నిర్వహించిన సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకల్లో తెలుగు తమ్ముళ్ల రెండు వర్గాలుగా విడిపోయి. సంబేపల్లి మండల కేంద్రంలోని రెండు ప్రాంతాల్లో పోటాపోటీగా కేక్ కటింగ్ చేసి నినాదాలు చేసుకున్నారు.

# గాలి, వాన బీభత్సం



పీలేరు రూరల్: జాతీయ రహదారిపై విరిగిపడిన చెట్టు



కలికిరి: మండలంలోని గుట్టపాళెం గ్రామంలో నేలరాలిన మామిడి

కలికిరి: గాలి, వాన సృష్టించిన బీభత్సంతో రైతులక నష్టం వాటిల్లింది. ఆదివారం మండల పరిధిలో పెనుగాలులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. గాలుల ధాటికి మామిడికాయలు నేలరాలగా, టమాట పంట దెబ్బతింది. బొప్పాయి తోటల్లో చెట్లు విరిగిపడ్డాయి. మరి కొన్ని చోట్ల వరి పంట నేలకొరిగింది. అసలే ధరలు లేక ఇబ్బంది పడుతున్న టమాట రైతులు పంట దెబ్బతినడంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు

**నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు**

పీలేరు రూరల్: మండలంలో గాలి, వాన భీభత్సంతో పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఆదివారం పీలేరు పట్టణంలోని బోయపాళెం వీధిలో, నగిరిలో, వరంపాటివారిపల్లెలో విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. స్పందించిన ట్రాన్స్‌కో ఏఈ ఖాదర్ ఇలాహి మరమ్మతులు చేయించి విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. పీలేరు పట్టణం మదనపల్లె మార్గంలోని రైల్వే స్టేషన్ వద్ద ఓ చెట్టు విరిగి జాతీయ రహదారిపై పడింది.

# ఎట్టకేలకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల

- పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు
- మెటీరియల్ కోసం పరుగులు
- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 705 పోస్టుల భర్తీకి అవకాశం

మదనపల్లె సిటీ: తొమ్మిది నెలలుగా ఊరించిన డీఎస్సీ నోటిఫికేషన్ ఎట్టకేలకు ఇచ్చారు. అయితే ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన పోస్టులు భర్తీ చేయనున్నారు. నోటిఫికేషన్ విడుదల చేయడంతో అభ్యర్థులు మెటీరియల్ కోసం బుక్ సెంటర్లు, కోచింగ్ సెంటర్లకు పరుగులు పెడుతున్నారు. ఇప్పటికే చాలా మంది అవనిగడ్డ, గుంటూరు, విజయవాడ, తిరుపతిలో కోచింగ్ సెంటర్లలో చేరి వేల రూపాయలు ఖర్చు పెట్టారు. ఈసారి డీఎస్సీలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1473. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 705 పోస్టులు భర్తీ కానున్నాయి.

**ఉమ్మడి వైఎస్‌ఆర్ జిల్లాలో ఖాళీ పోస్టుల వివరాలు...**

| సబెక్టు | పోస్టులు |
|---|---|
| ఎస్‌ఏ లాంగ్వేజ్ | 34 |
| ఎస్‌ఏ హిందీ | 18 |
| ఎస్‌ఏ ఇంగ్లీస్ | 81 |
| ఎస్‌ఏ మ్యాథ్స్ | 44 |
| ఎస్‌ఏ పీఎస్ | 30 |
| ఎస్‌ఏ బీఎస్ | 53 |
| ఎస్‌ఏ సోసియల్ | 65 |
| ఎస్‌పీ పిఈ | 82 |
| ఎస్‌జిటి | 298 |
| మొత్తం | 705 |

**ప్రైవేటు పాఠశాల టీచర్లకు కలిసొచ్చిన వేసవి సెలవులు**

జిల్లాలో చాలా మంది డీఎస్సీ అభ్యర్థులు ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. తాజాగా నోటిఫికేషన్ ఇవ్వడం.. వేసవి సెలవులు రావడం వారికి కలిసి వచ్చింది. దీంతో పాటు ప్రైవేటు పాఠశాలలకు కూడా ఇది కలిసి వచ్చింది.

**జిల్లాల వారీగా పోస్టులు వివరాలు:**

ప్రభుత్వం విడుదల చేసిన తాజా నోటిఫికేషన్‌లో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 705 ఉపాధ్యాయ పోస్టులు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల ప్రజాపరిషత్, మున్సిపాలిటీ పరిధిలో భర్తీ కానున్నాయి. ఇందులో 407 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు , 298 ఎస్‌జీటీ పోస్టులు భర్తీ కానున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1473 టీచరు పోస్టులు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల ప్రజాపరిషత్, మున్సిపాలిటీ పరిధిలో భర్తీ కానున్నాయి. ఇందులో ఎస్‌జీటీ పోస్టులు 976 కాగా,స్కూల్ అసిస్టెంట్లు 497 పోస్టులు భర్తీ కానున్నాయి.



ఓ కోచింగ్ సెంటర్‌లో కోచింగ్ తీసుకుంటున్న డీఎస్సీ అభ్యర్థులు


### 20 నుంచి...మే 15 వరకు..

ఈనెల 20వతేదీ నుంచి మొదలై ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ మే 15 వరకు ఉంటుంది. జూన్ 6 నుంచి జులై 6వతేదీ వరకు సీబీటీ(కంప్యూటర్ బేస్‌డ్ టెస్టు) విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. దీంతోపాటు డీఎస్సీ పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారం, జీవోలు, ఉపాధ్యాయ పోస్టుల వివరాలు, పరీక్షల షెడ్యూలు, సిలబస నోటిఫికేషన కోసం వెబ్ సైట్‌ను ఏర్పాటు చేశారు.

# ఆశలు ఆవిరి!

- జిల్లాకు రావాల్సిన కృష్ణా జలాలు చెర్లోపల్లెలోనే నిల్వ
- డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు ఆవిరైనవి 150 ఎంసీఎఫ్‌టీలు
- ఇటు నీళ్లు ఇవ్వకపోగా.. అటు పనులపై నిర్లక్ష్యం

బి.కొత్తకోట: శ్రీశైలం నుంచి 600 కిలోమీటర్లకుపైగా ప్రవహించిన కృష్ణా జలాలు అన్నమయ్య, చిత్తూరుజిల్లాలోకి ప్రవేశించేందుకు సిద్ధంగా ఉన్నా కూటమి ప్రభుత్వం చెర్లోపల్లె రిజర్వాయర్‌లోనే నిలిపివేసింది. దీంతో కరువు రైతాంగం ఆశలన్నీ ఆవిరయ్యాయి. నీళ్ల రిజర్వాయర్‌లో నిలిపివేసిన ఫలితంగా ఆవిరైపోతూ రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గిపోతోంది. ఈ ప్రభుత్వ నిర్ణయంపై రైతాంగం మండిపడుతోంది. ఇప్పటికే కరువు కోరల్లో చిక్కుకున్న రైతులకు కనీస ఉపశమనం కలిగేలా కృష్ణా జలాలు పారించినా కొంత ప్రయోజనం కలిగేది. దీనిపై నిర్లక్ష్యం ప్రదర్శించిన ప్రభుత్వం పుంగనూరు ఉప కాలువకు లైనింగ్ పనులను చూపి అన్నదాతను పూర్తిగా విస్మరించి కాంట్రాక్టర్ల పనులకే ప్రాధాన్యత ఇచ్చింది. మొదట నీళ్లు పారించాక పనులు చేయించే అవకాశం ఉన్నా ప్రభుత్వం నీటి నిలుపుదలకే మొగ్గు చూపింది. ఇప్పుడు రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న నీళ్లు ఎండకు, వేడికి ఆవిరై నష్టం కలుగుతోంది.



చెర్లోపల్లె రిజర్వాయర్‌లో ప్రస్తుత నీటినిల్వ

**ఆవిరవుతున్న నీళ్లు**

అన్నమయ్య, చిత్తూరుజిల్లాల్లోకి కృష్ణా జలాలను శ్రీసత్యసాయిజిల్లా కదిరి సమీపంలోని చెర్లోపల్లె జలాశయం నుంచి తరలిస్తారు. కృష్ణా జలాలను తరలించడం కోసం అనంతపురం జిల్లా జీడిపల్లి రిజర్వాయర్ నుంచి చెర్లోపల్లె రిజర్వాయర్‌కు గత డిసెంబర్‌లోనే నీటిని తరలించి నింపారు. ఈ రిజర్వాయర్ నీటినిల్వ సామర్థ్యం 1.681 టీఎంసీలు. ఇక్కడి నుంచి పుంగనూరు ఉపకాలువలోకి నీటిని విడుదల చేసుంటే జీడిపల్లె నుంచి నీటిని తరలించడం జరిగేది. డిసెంబర్ నుంచి ఇప్పటిదాకా నీళ్లను నిల్వ చేయడంతో ప్రస్తుతం నీటినిల్వ సామర్థ్యం తగ్గింది. గడచిన ఐదు నెలల్లో 150 ఎంసీఎఫ్‌టీల నీళ్లు అవిరైపోయినట్టు అధికార లెక్క. సద్వినియోగం చేసుకోకుండా నీళ్లి లాగే నిల్వ ఉంచేస్తే మరింతగా ఉపయోగం లేకుండా ఆవిరైపోతాయి.

### హక్కు కోల్పోతున్న రైతులు

హంద్రీ–నీవా ప్రాజెక్టులో భాగంగా ఉమ్మడి చిత్తూరుజిల్లాకు 12 టీఎంసీల కృష్ణా జలాల వాటాగా ఉంది. శ్రీశైలం నుంచి 40 టీఎంసీలు వాడుకోవాలన్నది బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చింది. ఈ మేరకు జిల్లాకు ఈ వాటా మేరకు నీటిని తరలించి ఆయకట్టు భూములకు నీళ్లు అందించాలి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మూడేళ్ల పాటు ఒకటిన్నర ఏడాది వరకు నీటిని పారించింది. సీఎం చంద్రబాబు నియోజకవర్గం కుప్పానికి కృష్ణాజలాలను పారించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ నిర్ణయంతో కృష్ణా జలాల తరలింపు ఆపేయడంతో జిల్లా రైతాంగం నీటి హక్కును కోల్పోతున్నారు.





పీటీఎంలో బి.కొత్తకోట వద్ద జరిగిన కొద్దిపాటి లైనింగ్ పనులు

### పేరుకే లైనింగ్ పనులు

జిల్లాలోని పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, కురబలకోట, మదనపల్లె రూరల్, చిత్తూరు జిల్లాలోని పుంగనూరు రూరల్, పెద్దపంజాణి మండలాల్లో హంద్రీ–నీవా ప్రాజెక్టు పుంగనూరు ఉపకాలువ 224.5 కిలోమీటర్ల దూరం సాగుతుంది. ఈ కాలువను రూ.1,217 కోట్లతో వెడల్పు పనులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్‌తో ఒప్పందం కూడా చేసుకుంది. ఈ పనులు కూడా మొదలైనా కూటమి ప్రభుత్వం రాగానే రద్దు చేసి..ఇవే నిధులు మిగిలాయంటూ రూ.480.22 కోట్లతో ఎన్‌సీసీ సంస్థకు టెండర్ లేకుండా నామినేషన్‌పై కట్టబెట్టేసింది. ఈ పనులను మేనెలలోగా పూర్తి చేస్తామని ప్రభుత్వం, అధికారులు ఇప్పటికే పలుమార్లు ప్రకటించారు. అయితే ఇంత వరకు జరిగిన పనులు నత్తనే తలపిస్తున్నాయి. కాంట్రాక్టు సంస్థ కాలువకు ఇరువైపులా లైనింగ్ పనులు చేపట్టి మేనెలలో పూర్తి చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు జరుగుతున్న పనులు నామమాత్రమే. అన్నమయ్య జిల్లా పరిధిలో 13 కిలోమీటర్లు, చిత్తూరు జిల్లా పరిధిలో రెండు కిలోమీటర్ల వరకే లైనింగ్ పనులు జరిగినట్టు అధికారుల లెక్క. ఈ పనులపై సాంకేతిక అధికారులు, క్వాలిటీ కంట్రోల్ విభాగం దృష్టి పెట్టలేదని తెలుస్తోంది. ఈ పరిస్థితి చూస్తుంటే ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా పనులు పూర్తయ్యే అవకాశాలు కనుచూపు మేర కనిపించడం లేదు.

## క్లుప్తంగా

### అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

**కలకడ :** దేవునికి చందా ఇస్తామని చెప్పి ఇవ్వలేదని ఓ మహిళను అసభ్యకరంగా మాట్లాడిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ రమేష్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దేవులపల్లె పంచాయతీ బొజ్జగుంట పల్లె వడ్డిపల్లెకు చెందిన రమణప్రసాద్ గుడికి చందాలు వసూలు చేయగా అదే గ్రామానికి చెందిన డేరింగుల చంద్రయ్య, చంద్రయ్య భార్య లక్ష్మీదేవిలు చందా ఇస్తామని చెప్పి ఇవ్వలేదని శనివారం రాత్రి వారి ఇంటికి వెళ్లి దుర్భాషలాడి లక్ష్మీదేవిపై దాడిచేశాడు. ఆదివారం బాధితురాలు లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రమణప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### కారు ఢీకొని ఇద్దరికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన నదియ

**కలకడ :** ద్విచక్రవాహనంను కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటన ఆదివారం చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలకడ టౌన్‌కు చెందిన ఉమ్మర్ అతని భార్య నదియలు వారి ద్విచక్రవాహనంలో కలకడ వైపు నుంచి రాయచోటివైపు వెళుతుండగా.. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై కలకడ ఇందిరమ్మ కాలనీ వద్ద పీలేరు నుంచి రాయచోటి వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడ్డ ఉమ్మర్, నదియలను చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

### యువకులకు గాయాలు



గాయపడిన యువకులు

**పెద్దతిప్పసముద్రం :** పొట్టకూటి కోసం దినసరి కూలి పని కోసం వెళుతున్న ఇద్దరు యువకులను బొలేరో వాహనం ఢీ కొనడంతో గాయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కందుకూరుకు చెందిన షానవాజ్ (18), జాఫర్ (21)లు పొట్టకూటి కోసం వెల్డింగ్ చేయడానికి సరిహద్దు కర్నాటక రాష్ట్రం ఊదోళ్ళపల్లికి ద్విచక్ర వాహనంలో ఆదివారం బయలు దేరారు. ఈ నేపథ్యంలో మండలంలోని కుక్కలపల్లి సమీపంలో ఓ బొలేరో వాహనం ఎదురుగా వచ్చి వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. ఈ ఘటనలో జాఫర్‌కు స్వల్పగాయాలు కాగా షానవాజ్ అనే మరో యువకుడి కాలు విరిగింది. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా బి.కొత్తకోట సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించారు. తీవ్రంగా గాయపడిన షానవాజ్‌ను మెరుగైన వైద్యం కోసం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

### కారుఢీ కొని యువకుడికి తీవ్ర గాయాలు

**మదనపల్లె :** కారు ఢీకొని యువకుడు గాయపడిన సంఘటన ఆదివారం కురబలకోట మండలంలో జరిగింది. మదనపల్లె పట్టణం కురవంక ప్రాంతానికి చెందిన సుధాకర్ కుమారుడు హర్ష (24) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో వెళుతుండగా విశ్వం కాలేజీ సమీపంలో ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. ప్రమాదంలో హర్ష గాయపడగా గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు బాధితుడిని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ముదివేడు పోలీసులు విచారణ చేస్తున్నారు.

# ఔషధ గుణం.. ఆరోగ్య ప్రదం

- తాటిముంజల్లో పుష్కలంగా విటమిన్లు
- భానుడి ప్రతాపంతో హాట్ కేకుల్లా తాటిముంజల విక్రయాలు
- ఐస్ యాపిల్‌గా ప్రాచుర్యం

**రాజంపేట టౌన్ :** ప్రచండ భానుడి భగభగలతో అల్లాడుతున్న వేసవిలో చల్లని పదార్థాలకు, ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగించే పదార్థాలకు మంచి డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం భానుడు తన ప్రతాపం చూపుతుండటంతో శరీరానికి చలువచేసే వివిధ పదార్థాలతో ప్రజలు సేద తీరుతున్నారు. వడదెబ్బ బారిన పడకుండా శరీరం డీహైడ్రేషన్ కాకుండా మజ్జిగ, కొబ్బరిబోండాలు, పుచ్చకాయలు, పండ్ల రసాలు వంటివి వేసవి తాపాన్ని తీర్చుతున్నాయి. అయితే వేసవిలో తాటిముంజలకు ప్రత్యేక స్థానం ఉంది. వేసవి తాపాన్ని అధిగమించేందుకు, వేసవిలో శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారించి ఆరోగ్య ప్రయోజనాలను చేకూర్చేందుకు ప్రకృతి ప్రసాదించిన తాటిముంజలు (ఐస్ యాపిల్) విశేష ప్రాచుర్యం పొందాయి. తాటిముంజల సీజన్ ప్రారంభం కావడం, దీనికితోడు భానుడు తన ప్రతాపాన్ని చూపుతుండటంతో ముంజలకు డిమాండ్ ఏర్పడింది. కొంత మంది వ్యాపారులు వైఎస్సార్ జిల్లా వేంపల్లె నుంచి తాటిముంజలను రాజంపేటకు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. తాటిముంజలు శరీరంలో చక్కెర, ఖనిజాల ప్రమాణాలను సమతుల్యం చేసే లక్షణం కలిగివున్నందున ముంజల విక్రయాలు హాట్ కేకుల్లా సాగుతున్నాయి.

**ఆరోగ్య ప్రదాయిని..**

ప్రకృతిలో విరివిగా లభ్యమయ్యే తాటిముంజలు కల్తీ లేని, స్వచ్ఛమైనవి కావడంతో ఆరోగ్య ప్రదాయిని అని వైద్యులు కూడా చెబుతున్నారు. ధర ఎక్కువైనా ప్రజలు వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. డజను నూరు రూపాయిల నుంచి నూట ఇరవై రూపాయిలకు విక్రయిస్తున్నారు. అనేక మంది ఇవి విక్రయించే ప్రాంతంలో వేచివుండి మరీ కొనుగోలు చేస్తున్నారు. లేతగా ఉండే వాటికి గిరాకీ ఎక్కువగా ఉంది.



కాయ నుంచి తాటిముంజలను బయటకు తీస్తున్న వ్యాపారులు

**అనేక ప్రయోజనాలు..**

- తాటి ముంజల్లో విటమిన్లు, ఫాస్పరస్, థయామిన్, బీ-కాంప్లెక్స్, కాల్షియం, పొటాషియంతో పాటు సోలెబుల్ ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి.



తాటిముంజలు

- వీటిలో నీటిశాతం ఎక్కువగా ఉండటం వల్ల డీహైడ్రేషన్ నుంచి ఉపశమనం కలిగిస్తుంది. వేసవితాపం, వడదెబ్బ నుంచి రక్షణ కల్పిస్తుంది.
- తాటిముంజలు తినడం వల్ల శరీరంలో పేరుకున్న హానికర వ్యర్థ పదార్థాలను బయటకు పంపడంతో పాటు రక్తపోటును అదుపులో ఉంచుతుంది.
- వేసవిలో ఏటా క్రమం తప్పకుండా తినడం ద్వారా చెడుకొలెస్ట్రాల్ తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ వృద్ధి చేస్తుంది.
- వేసవిలో వచ్చే చికెన్ ఫాక్స్‌ని నివారించి, శరీరాన్ని చల్లగా ఉంచుతుంది.
- చర్మానికి కావాల్సినంత తేమను అందించి చెమట కాయల్ని నివారిస్తుంది.

**వ్యాపారం జోరుగా సాగుతుంది**



ఎండలు ఎక్కువగా ఉన్నందున తాటిముంజల వ్యాపారం జోరుగా సాగుతోంది. మేము వేంపల్లె నుంచి తాటిముంజలను తీసుకొస్తున్నాము. కొంత మంది తాటిముంజలు ఎప్పుడు వస్తాయా అని వేచివుంటున్నారు. ఖర్చులన్నిపోను ఆశాజనకంగా మిగులుబాటు ఉంది.

– శివ, తాటిముంజల వ్యాపారి

**పోషక విలువలు అధికం**



వేసవిలో అధికంగా ఎండలు ఉండటం వల్ల మనిషి శరీరంలో నీటిని కోల్పోతాడు. అందువల్ల శరీరానికి కావాల్సిన పోషకాలను ఎప్పటికప్పుడు అందిస్తుండాలి. తాటిముంజలు వేసవితాపాన్ని తీర్చడంతో పాటు పోషకాలను అందిస్తాయి. వీటిలో ముఖ్యంగా తేమ, కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, పీచు పదార్థాలు వంటి పోషక పదార్థాలు ఉంటాయి. ఇవి మనిషి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

– డాక్టర్ పాలనేని వెంకటనాగేశ్వరరాజు, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆసుపత్రి రాజంపేట

### రైల్వే లోకో పైలెట్లకు వసతుల కల్పన

- రూ.60 లక్షలతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తి చేస్తాం
- రైల్వే ఏడీఆర్ఎం సుధాకర్

**ఎర్రగుంట్ల (జమ్మలమడుగు) :** రైల్వే లోకో పైలెట్ అండ్ గార్డ్స్ ఎనిమిది గంటల ప్రయాణం చేసి ఎటువంటి ఒత్తిడికి లోను కాకుండా ఇక్కడ విశ్రాంతి తీసుకోవడానికి ప్రత్యేక సదుపాయాలు కల్పించినట్లు రైల్వే ఏడీఆర్ఎం సుధాకర్ అన్నారు. ఆదివారం ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్‌లో ఉన్న రైల్వే రన్నింగ్ రూమ్‌ను ఆయన పరిశీలించి అక్కడ లోకో పైలెట్లకు ఉన్న సదుపాయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ ఆవరణలో 2022లో రూ.97 లక్షలతో గ్రౌండ్ ఫ్లోర్‌ను నిర్మించామన్నారు. ఇప్పుడు రూ.1.37 కోట్లతో మహిళలకు, పురుషులకు వేరువేరుగా అన్ని వసతులతో విశ్రాంతి గదిని నిర్మించామన్నారు. ఇక్కడ విశ్రాంతి గది, యోగ, లైబ్రరీ, లోకో పైలెట్లకు అవగాహన కోసం సూచనలు ఇచ్చే ప్రత్యేక గది ఏర్పాటు చేశామన్నారు. అంతేకాక రూ.60 లక్షతో ఎర్రగుంట్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తున్నామని ఇది జూన్ నెలకు పూర్తి చేస్తామన్నారు. ఎర్రగుంట్ల రైల్వే రన్నింగ్ రూమ్‌లో ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. లోకోపైలెట్లకు ప్రత్యేక వంట గది కూడా ఉందని, వారికి ప్రత్యేక మెను ప్రకారం భోజన సదుపాయం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీఈఈ వీరయ్య, చీఫ్ క్రూప్ కంట్రోలర్ సిద్దు సాహెబ్, ఏడీఈఎన్ రాధాకృష్ణ, ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాసులు, చీఫ్ లోకో ఇన్‌స్పెక్టర్ బాబాజాన్, మధుసూదన్, వీఎస్ రాజు పాల్గొన్నారు.

# బాబు బర్త్‌డే వేడుకలో మారని తమ్ముళ్ల తీరు

- ఎవరికి వారు.. రెండు వర్గాలు కేక్ కటింగ్
- కార్యకర్తలలో అయోమయం

**రైల్వేకోడూరు అర్బన్ :** రైల్వేకోడూరు టీడీపీలో వర్గపోరు ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలలో కూడా స్పష్టంగా కనిపించింది. పట్టణంలోని మాజీ ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు పార్టీ కార్యాలయం, రాఘవరాజపురంలోని ప్రస్తుత టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి పార్టీ కార్యాలయంలో బాబు పుట్టిన రోజు వేడుకలు జరిపారు. వారం క్రితం రాఘవరాజపురంలోని రూపానంద రెడ్డి కార్యాలయం వద్ద మంత్రి జనార్దన్ సమక్షంలో జరిగిన ఇరువర్గాల బాహాబాహి రచ్చ వర్గపోరు తారాస్థాయికి చేరింది. ప్రస్తుత ఇన్‌చార్జ్ ఒంటెద్దు పోకడలతో నిజమైన కార్యకర్తలకు ప్రాధాన్యం లేకుండా పోయిందని పలువురు నాయకులు ఆరోపించారు. అలాగే రూపానందరెడ్డి పార్టీ కార్యాలయం అద్దాలు ధ్వంసం చేసి రెండు గంటల పాటు రోడ్డున పడి రభస సృషించారు. దీంతో మంత్రి సైతం బయటకు రాకుండా కార్యాలయం లోపలే ఉండి పోయిన విషయం తెలిసిందే. తాజాగా కోడూరులో వర్గపోరు బాబు జన్మదిన వేడుకలలో కనిపించింది. ముక్కా రూపానందరెడ్డి కార్యాలయంలో ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కట్టాబాలాజీ, గుండయ్యనాయుడు, తాతంశెట్టి నాగేంద్ర, గునిపాటి రాయుడు తదితరులు పాల్గొని కేక్ కట్ చేశారు. అలాగే కస్తూరి కార్యాలయంలో మాచినేని విశ్వేశ్వర రావు, మాజీ టీడీపీ అభ్యర్థులు అజయ్‌బాబు, నరసింహప్రసాద్, జనసేన టికెట్ ఆశించి భంగపడిన మనమల భాస్కర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొని భారీగా సభ ఏర్పాటు చేశారు. దీంతో బల నిరూపణ చేసినట్లయింది. నియోజకవర్గంలో కుటుంబ పాలన చేస్తూ నిజమైన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు న్యాయం జరగలేదంటూ పలువురు ఆక్రోశం వెలిబుచ్చడం గమనార్హం.



ముక్కా రూపానందరెడ్డి కార్యాలయంలో కేక్ కటింగ్



కస్తూరి కార్యాలయంలో పాల్గొన్న కార్యకర్తలు, నాయకులు

# ఇరుగులమ్మా.. దీవించవమ్మా..

- 40 ఏళ్ల తర్వాత గురువు దేవర
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న గడికోట శ్రీకాంత్ రెడ్డి

**గాలివీడు :** ఇరుగులమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం గాలివీడు మండలం, గోపనపల్లె గ్రామం పూజారి వాండ్లలో ఆదివారం నిర్వహిస్తున్న నల్లాబత్తుని వారి గురువు దేవర కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలసి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు, స్థానిక ప్రజలు శ్రీకాంత్ రెడ్డి కి ఘన స్వాగతం పలికి ఆయన చేత ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహింపచేసి తీర్థ ప్రసాదాలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ 40 సంవత్సరాల తరువాత నల్లాబత్తుని వంశీయులందరూ సమిష్టిగా కలసి పండుగ వాతావరణంలో ఘనంగా గురువు దేవర నిర్వహించుకోవడం ఆనందదాయకంగా ఉందన్నారు. ఇరుగులమ్మ అమ్మవారి దయతో వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుభిక్షంగా, సంతోషంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు.

**ఆప్యాయంగా.. ఆత్మీయంగా..**



గురువు దేవరలో పాల్గొన్న శ్రీకాంత్ రెడ్డి, ఇతర నేతలు

వేలాది మంది ప్రజలు పాల్గొన్న ఈ గురువు దేవర కార్యక్రమంలో ప్రజలందరినీ శ్రీకాంత్ రెడ్డి పేరు పేరునా.. ఆత్మీయంగా.. ఆప్యాయంగా పలకరించి మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ స్టేట్ లీగల్ సెల్ కో ఆర్డినేటర్ జిల్లా సుదర్శన్ రెడ్డి, మండల కన్వీనర్ మిట్టపల్లె యదుభూషణరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల నాగభూషన్ రెడ్డి, మాజీ ఎంపీపీ బండి చిన్నరెడ్డి, వాటర్ షెడ్ చైర్మన్ బండి బసిరెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్‌రెడ్డి, భూమా అమర్‌నాథరెడ్డి, సర్పంచులు ఉమాపతి రెడ్డి, చెన్నకేశవ రెడ్డి, రామాంజులు రెడ్డి, ఉమా ప్రభాకర్, ఎంపీటీసీలు అమానుల్లా, చిన్నపురెడ్డి, మాజీ ఎంపీటీసీ చిన్నావుల చిన్నపు రెడ్డి, నాయకులు రమణా రెడ్డి, ఇటాచి రమణా రెడ్డి, నల్లా బత్తుని వెంకటరెడ్డి, భానుమూర్తి రెడ్డి, బండి బసిరెడ్డి, వల్లపు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# రెచ్చిపోతున్న మట్టి మాఫియా

- అడ్డుకున్నందుకు వీఆర్వోపై దౌర్జన్యం
- రెండు జేసీబీలు, ఏడు ట్రాక్టర్లు సీజ్



వీఆర్వో ఖాదర్‌బాషా

**కురబలకోట :** మండలంలో మట్టి మాఫియా చెలరేగిపోతోంది. చెరువులు, గుట్టలు, డీకేటీ భూముల్లో మట్టిని అక్రమంగా తరలిస్తూ అక్రమ దందాకు పాల్పడుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అధికార పార్టీ అండతో రెచ్చిపోతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో కొద్ది రోజులుగా అంగళ్లు గ్రామంలోని గుర్రాలవారిపల్లి వద్ద డీకేటీ భూముల్లో కనసానివారిపల్లెకు చెందిన మధు, కృష్ణమూర్తి జేసీబీలతో ఇష్టాను సారంగా రాత్రింబవళ్లు మట్టిని తోలి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయం ఆదివారం రెవెన్యూ అధికారుల ఆదేశాలతో అంగళ్లు వీఆర్వో ఖాదర్ బాషా దృష్టికి వచ్చింది. ఆయన నేరుగా ఒక్కడే వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేశాడు. దీంతో మట్టి మాఫియా నిర్వాహకుడు మధు వీఆర్వో మోటార్ సైకిల్ తాళాలను లాక్కున్నాడు. మట్టి తోలితే మీ వల్ల ఏమవుతుందని ప్రశ్నించాడు. ఆపై బరితెగించి దౌర్జన్యానికి దిగాడు. దీంతో పోలీసుల సహకారంతో వీఆర్వో మట్టి తోలుతున్న జేసీబీలను, ఏడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ముదివేడు పోలీసులకు అప్పగించారు. వారు వాటిని సీజ్ చేసి మైనింగ్ శాఖకు నివేదిక పంపారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ దిలీప్ కుమార్ తెలిపారు.



జేసీబీతో ట్రాక్టర్‌కు మట్టి లోడ్ చేస్తున్న దృశ్యం

### వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

**మదనపల్లె :** వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిమ్మనపల్లె మండలం ముష్టూరుకు చెందిన రెడ్డిశేఖర్ భార్య మమత (23) కుటుంబ సమస్యల కారణంగా భర్తతో గొడవ పడి మనస్థాపం చెంది ఇంటి వద్దే పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. అదే విధంగా ములకలచెరువు మండలం దేవలచెరువు పంచాయతీ రాజుగారిపల్లెకు చెందిన చిన్న వెంకటరమణ కుమారుడు భాస్కర(55) కుటుంబ సమస్యలతో మనస్థాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఆయా ఘటనల్లో బాధితులను హుటాహుటిన 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

### వ్యక్తి మృతి

**ఒంటిమిట్ట :** మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామం, హరిజనవాడకు చెందిన ఎర్రబల్లి గంగాధర్ (31) అనే వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఒంటిమిట్ట పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గంగాధర్‌కు 10 సంవత్సరాల క్రితం వల్లూరు మండలం, కొట్లూరు గ్రామంలో రెడ్డమ్మ అనే మహిళతో వివాహం జరిగింది. వీరికి సంతానం లేదు. గంగాధర్ వివాహం చేసుకున్నప్పటి నుండి మద్యానికి బానిస కావడంతో తరచూ భార్య భర్తల మధ్య గొడవలు జరుగుతూ ఉండేవి. ఎంత చెప్పినా భర్త గంగాధర్ మద్యాన్ని మానుకోకపోవడంతో భార్య రెడ్డమ్మ ఐదేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుండి గంగాధర్ వద్దకు భార్య రెడ్డమ్మ రాకపోగా మూడు నెలల క్రితం రెడ్డమ్మ మరో వివాహం చేసుకుందని భర్త గంగాధర్‌కు తెలిసింది. దీంతో మనస్తాపానికి గురైన గంగాధర్ ఇక నేను బతకను.. చనిపోతాను అని బంధువులకు, ఊరి ప్రజలకు చెప్పుకుంటూ ఉండేవాడని, చివరకు ఈనెల 17న తన ఇంటివద్ద ఉన్న మామిడి తోటలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గంగాధర్‌ను కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

### మైనర్ బాలికకు ఆశ్రయం కల్పించినందుకు అరెస్ట్

**మైదుకూరు :** కిడ్నాప్ అయిన మైనర్ బాలికకు వివాహం చేసేందుకు ఆశ్రయం కల్పించినందుకు మండలంలోని తువ్వపల్లెకు చెందిన ఊటుకూరు రఘురామిరెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు అర్బన్ ఎస్ఐ చిరంజీవి తెలిపారు. తువ్వపల్లెకు చెందిన మైనర్ బాలిక ఈనెల 14 న కిడ్నాప్‌నకు గురైందని, 15వ తేదీ ఆమె తల్లి ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు. సదరు మైనర్ బాలికకు వివాహం చేసేందుకు ఆమెకు రఘురామిరెడ్డి తన ఇంటిలో ఆశ్రయం కల్పించినట్టు తెలిపారు. దీనిపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఆదివారం అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు ఎస్ఐ వివరించారు.

# ఆపదలో ఆదుకున్న ఎమ్మెల్యే

**తంబళ్లపల్లె :** ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మానవత్వం చాటుకున్నారు. బ్రెయిన్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న ఓ చిన్నారి వైద్య ఖర్చులకు ఆదివారం రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారు. మండలంలోని అన్నగారిపల్లెకు చెందిన విశ్వనాథ్ కుమారుడు రిషిక్ (6) అనే చిన్నారి బ్రెయిన్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతూ బెంగుళూరులో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సతీమణి కవితమ్మ బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. తక్షణ సహాయంగా రూ.50 వేలు నగదు అందజేశారు. ఇంకా ఎలాంటి సమస్య వచ్చినా తమ దృష్టికి తేవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు జైసింహారెడ్డి, సర్పంచు కె.జ్యోతి, మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, నాయకులు నారాయణరెడ్డి, రమణారెడ్డి, సుదాకర్‌రెడ్డి, మల్లికార్జున నాయుడు, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




బాధితుడి కుటుంబసభ్యురాలికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి కవితమ్మ


# మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

**రామసముద్రం :** నగల విషయమై అత్త దండించినందుకు మనస్తాపానికి గురై వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రామసముద్రం దిగవపాళ్యంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రవికుమార్ కథనం మేరకు.. స్థానిక దిగువాళ్యంకు చెందిన ఓగిని మేఘన (20)కు చెందిన బంగారు నగలను ఆమె భర్త శివ కుదువ పెట్టాడు. దీంతో అత్త కోడలిని వారించి వేరుగా ఉంటానని దండించి వెళ్లిపోయింది. విషయాన్ని మేఘన భర్తకు తెలిపింది. అతడు తన తల్లిని తీసుకు వస్తానని వెళ్లగా.. మనస్తాపానికి గురైన మేఘన ఇంటిలో చీరకు ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. భర్త వచ్చి చూసేసరికి చీరకు వేలాడుతున్న భార్యను హుటాహుటిన కిందకు దించి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఈ సంఘటనపై మృతురాలి తండ్రి గంగవరం మండలం మార్లపల్లెకి చెందిన కె. సుబ్రమణ్యం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# దైవదర్శనానికి వెళ్లి వస్తూ తిరిగిరాని లోకాలకు..



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నరసింహులు



ఝాన్సీ మృతదేహం

- నెల్లూరు జిల్లా కదిరినాయుడుపల్లె సమీపంలో రోడ్డు ప్రమాదం
- ఇరువురు బద్వేలు వాసులు మృతి

**బద్వేలు అర్బన్ :** నెల్లూరు జిల్లాలోని పెంచల కోనకు వెళ్లి దైవదర్శనం చేసుకుని తిరిగి వస్తుండగా బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఇరువురు బద్వేలు వాసులు మృతిచెందారు. ఆదివారం నెల్లూరు జిల్లాలోని కదిరినాయుడుపల్లె అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అక్కడి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బద్వేలు నియోజకవర్గంలోని అట్లూరు మండలం ముత్తుకూరు గ్రామానికి చెందిన ఎం.నరసింహులు (26) పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. అలాగే పట్టణంలోని రూపరాంపేటకు చెందిన వై.ఝాన్సీ (26) అదే ఆసుపత్రిలో పనిచేస్తోంది. ఇరువురు కలిసి శనివారం సాయంత్రం బద్వేలు నుండి ద్విచక్ర వాహనంలో పెంచలకోనకు బయలు దేరారు. అక్కడ దైవదర్శనం చేసుకుని రాత్రికి అక్కడే ఉండి ఉదయాన బద్వేలుకు బయలుదేరారు. ఈ క్రమంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిలోని కదిరినాయుడుపల్లె అటవీ ప్రాంతంలోకి వచ్చేసరికి బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొన్నారు. ఈ ఘటనలో ఝాన్సీ అక్కడికక్కడే మృతిచెందగా నరసింహులును స్థానికులు 108 వాహనంలో బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మర్రిపాడు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ఆటో ఢీ ఒకరు మృతి



సంఘటనా స్థలంలో పరిశీలిస్తున్న ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి

**రాయచోటి టౌన్ :** ఓమినీ ఆటో ఢీకొన్న దుర్ఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. రాయచోటి ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి రాయచోటి – మదనపల్లె రోడ్డు మార్గంలోని గొర్లమొదివీడు క్రాస్‌లో ఓమిని ఆటో మదనపల్లె రోడ్డు వైపు నుంచి రాయచోటికి వస్తోంది. అదే క్రమంలో రాయచోటి నుంచి ఆటో రాయచోటి నుంచి చిన్నమండెం వైపు వెళ్లుతోంది. ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో ఆటో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో 108 ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఆటోడ్రైవర్ దేవంద్ర మరణించాడు. మిగిలిన ఇద్దరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి జరిగిన సంఘటనపై విచారణ సాగించి కేసు నమోదు చేశారు. మృతుడు గాలివీడు మండలం తూముకుంటకు చెందిన వాడిగా గుర్తించారు.

### పిడుగుపాటుకు యువకుడి బలి

**పెద్దముడియం :** మండలంలోని చిన్నముడియం గ్రామంలో దండు భాను(22) అనే యువకుడు పిడుగు పాటుకు బలయ్యాడు. జమ్మలమడుగు మండలం ఉప్పలపాడు గ్రా మానికి చెందిన నాగ సుబ్బరాయుడు, రామక్క అనే దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె కలరు. వీరు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవారు. వీరికి మండలంలోని చిన్నముడియం గ్రామంలో పొలం ఉండటంతో కొర్ర పంటను సాగు చేస్తున్నారు. ఆదివారం రోజు మధ్యాహ్నం కొర్ర పంటకు నీరు కడుతుండగా గాలి వాన వచ్చింది. ఆ సమయంలో దండు భానుకు సమీపంలో పిడుగు పడటంతో ఆ శబ్దానికి అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.